సమాచారం

ఉత్తమ ఉపాధ్యాయులకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 12 : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ-2024 ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 5వ తేదీన జరగబోయే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి అవార్డులు అందజేస్తామని, అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఐఐసీటీ ఆడిటోరియంలో 21న సదస్సు

సిటీబ్యూరో, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ): వైద్య రంగానికి ఉపయోగపడే ఫ్రాంటీయర్స్ ఆఫ్ కెమికల్ బయాలజీపై ఐఐసీటీ, సీసీఎంబీ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన ఐఐసీటీలోని ఆడిటోరియంలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా బెంగళూరుకు చెందిన ఇన్‌స్టెమ్ పరిశోధకులు ప్రవీణ్ వేముల తొలి వక్తగా హాజరుకానున్నారు. కెమికల్ టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక విధానాలు, వైద్య అవసరాల దృష్ట్యా చేపట్టాల్సిన పరిశోధనలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. సాయంత్రం 4గంటలకు ఈ సదస్సు ఉంటుందని, ఆసక్తి గల వారు హాజరుకావచ్చని సీసీఎంబీ వర్గాలు పేర్కొన్నాయి.

తనీశ్ అదుర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో జరుగుతున్న బాలుర అండర్-16 అంతర పాఠశాలల, కాలేజీ మధ్య మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన టీ20 మ్యాచ్‌లో బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ 130 పరుగుల తేడాతో లిబర్టీ హైస్కూల్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బిర్లా స్కూల్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. తనీశ్ చక్రవర్తి(77) అర్ధసెంచరీతో కదంతొక్కగా, ఆరుశ్(37) ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన లిబర్టీ స్కూల్ 14.2 ఓవర్లలో 54 పరుగులకే కుప్పకూలింది. రోహన్, సిద్ధార్థ్ రెండేసి వికెట్లతో విజృంభించారు.

శిథిల భవనాల కూల్చివేతలు ముమ్మరం

ఆరు జోన్లలో 566 గుర్తింపు, 235 చోట్ల చర్యలు

పురోగతిలో 331, సెల్లార్ ప్రమాదాల నివారణపై స్పెషల్ డ్రైవ్

సిటీబ్యూరో, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ): వర్షాకాల నేపథ్యంలో పురాతన భవనాలు, సెల్లార్ ప్రమాదాలపై జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అప్రమత్తమై చర్యలు వేగవంతం చేసింది. ప్రమాదకర భవనాలపై జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సర్కిళ్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపడుతూ శిథిల, ప్రమాదకరమైన భవనాలలో ఉన్న నివాసితులను గుర్తించి.. వారిని అక్కడి నుంచి ఖాళీ చేయడానికి గానూ వారికి ముందుగా కౌన్సెలింగ్ ఇస్తున్నారు. దాంతోపాటు అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాల సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా ఆయా భవనాల చుట్టూ బారీ కేడ్లను అమర్చుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనాలను కూల్చివేస్తున్నారు. వీటితో పాటు అక్టోబర్ నెలాఖరు వరకు వర్షాకాలంలో సెల్లార్ల తవ్వకాల నిషేధం అమల్లో ఉన్నది. ఈ క్రమంలో సెల్లార్ ప్రమాదాలు జరగకుండా టౌన్‌ప్లానింగ్ విభాగం చర్యలు చేపడుతున్నదని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు.

సెల్లార్ ప్రమాదాలపై ప్రత్యేక నజర్

జోన్	సెల్లార్ల నిర్మాణాలు గుర్తించినవి	రిటర్నింగ్ వాల్ నిర్మాణం	రిటర్నింగ్‌వాల్ నిర్మాణం పురోగతిలో ఉన్నవి
ఎల్బీనగర్	33	11	22
చార్మినార్	27	17	10
ఖైరతాబాద్	40	32	8
సికింద్రాబాద్	10	6	4
శేరిలింగంపల్లి	30	18	12
కూకట్‌పల్లి	27	18	9
మొత్తం	167	102	65

శిథిలా భవనాల వివరాలు

జోన్	మొత్తం భవనాలు	కూల్చినవి	ఖాళీ చేసినవి/ మరమ్మతులు చేసినవి	పెండింగ్‌లో ఉన్నవి
ఎల్బీనగర్	75	28	34	13
చార్మినార్	154	28	25	101
ఖైరతాబాద్	123	17	46	60
సికింద్రాబాద్	32	11	11	110
శేరిలింగంపల్లి	33	3	2	18
కూకట్‌పల్లి	49	2	18	29
మొత్తం	566	89	146	331

ఎల్బీనగర్ కామినేని దవాఖానలోని ఇందిరా ఆడిటోరియంలో సోమవారం 'ప్రపంచ అవయవదాన' దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అవగాహన కల్పించే కార్యక్రమంలో టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ పాల్గొని మాట్లాడారు. మరణించిన ఒక వ్యక్తిలోని అవయవాలను దానం చేయడం ద్వారా మరో 8 మందికి ప్రాణం పోయవచ్చునని తెలిపారు. అనంతరం అవయవదానాలు చేయాలనే వారి కోసం క్యూఆర్‌కోడ్‌ను విడుదల చేశారు. కామినేని హాస్పిటల్స్ ఎండీ శశిధర్, సీఈఓ డాక్టర్ గాయత్రి, డాక్టర్ స్వర్ణలత పాల్గొన్నారు.
- మన్సూరాబాద్, ఆగస్టు 12

'డ్రగ్స్'ను తరిమికొడుదాం

దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చెప్పారు. మాదకద్రవ్యాలు ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడమే కాకుండా వారి కుటుంబాలను, సమాజాన్ని నాశనం చేస్తుందన్నారు. గోల్కొండ ప్రభుత్వ బాలురు ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో సోమవారం 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం జరిగింది. అనంతరం డిజేబుల్ వెల్ఫేర్ డైరెక్టర్ శైలజ, కలెక్టర్ అనుదీప్ విద్యార్థులతో డ్రగ్స్ ఫ్రీ ఇండియా, డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ ప్రతిజ్ఞలు చేయించారు. డీఈఓ రోహిణీ, డిజేబుల్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్, డిప్యూటీ డీఈఓ రమణ రాజు పాల్గొన్నారు.
-సిటీబ్యూరో, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ)

ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేయాలి

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసిన మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

మణికొండ, ఆగస్టు 12: ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మణికొండ మున్సిపాలిటీ భారత రాష్ట్ర సమితి నాయకులు,కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యే హరీశ్‌రావును నానక్‌రామ్‌గూడ హైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని క్రిన్స్ టెర్మినస్ విల్లాలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే కాలంలో ప్రజల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని, ఇప్పటి వరకు కార్యకర్తలకు సరైన గుర్తింపు లేకుండా పోయిన విషయాన్ని తెలుసుకోవడం జరిగిందన్నారు. మణికొండ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగళ్ల ధనరాజ్, ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, మణికొండ కౌన్సిలర్ ఆలస్యం నవీన్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, విజయలక్ష్మి, రేఖ, సీనియర్ నాయకులు ముతంగి లక్ష్మయ్య, అందె లక్ష్మణ్‌రావు, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, జై, బుద్దోల్ బాబు, దిలీప్, భాను, ఉపేంద్రనాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, యాలాల కిరణ్, ఎర్రోళ్ల రమేశ్, శివాజీ, ఆరీఫ్, సయ్యద్ రఫీక్, ఎల్లస్వామి, సబిన్, అలి, అశోక్, కృపాకర్, మోనేశ్ పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో పంద్రాగస్టు

గోల్కొండ కోటలో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్ శాంతికుమారి

మెహిదీపట్నం, ఆగస్టు 12: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకలను నిర్వహించనున్నది. ఈ ఏర్పాట్లను సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పరిశీలించారు. ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణను ఆదేశించారు. అదేవిధంగా పోలీస్ బందోబస్తు భారీగా ఏర్పాటు చేయాలని డీజీపీ జితేందర్‌కు సూచించారు. పాఠశాలల విద్యార్థులను అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని విద్యాశాఖ అధికారులకు చెప్పారు. ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్ ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ జితేందర్ తోపాటు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రామానంద స్కూల్ అభివృద్ధికి సహకరిస్తాం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ ప్రాంగణంలో చిల్డ్రన్స్ పార్కును ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని. చిత్రంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

బేగంపేట్, ఆగస్టు 12: రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. సోమవారం బేగంపేటలోని రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌లో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన చిల్డ్రన్స్ పార్కును ఆయన ఎమ్మెల్సీ సురభి వాణిదేవితో కలిసి ప్రారంభించారు. ముందుగా స్కూల్ ఆవరణలో దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. పీవీ నర్సింహారావు ఆధ్వర్యంలో ఎంతో మందికి శ్రీరామానంద తీర్థ మెమోరియల్ ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఈ మెమోరియల్‌ను నిర్వహిస్తూ అభివృద్ధిలోకి తీసుకువచ్చిన మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ఎమ్మెల్సీ సురభి వాణిదేవిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మెమోరియల్ సభ్యులు చంద్రశేఖర్, శేఖర్ మారం రాజు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ ముదిరాజ్, నరేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఈదులకుంటను కబ్జా నుంచి కాపాడండి

హైడ్రా కమిషనర్‌కు వినతి

మియాపూర్, ఆగస్టు 12: శేరిలింగంపల్లి మండలం ఖానామేట్ సర్వే నంబర్ 7లో ఉన్న 6.5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాల నుంచి కాపాడాలని సీపీఐఎం శేరిలింగంపల్లి జోన్ కమిటీ ఆధ్వర్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ.రంగానాథ్‌కు విన్నవించారు. సోమవారం బుద్ధ వనంలోని కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. 1954-55 ఖాస్రా పహణీ నుంచి నేటి ధరణి వరకు రెవెన్యూ రికార్డుల్లో చెరువు, ప్రభుత్వ భూమిగానే ఉన్నదని, క్షేత్రస్థాయిలో భారీ ఎత్తున మట్టితో చెరువును నింపుకుని కబ్జాకు పాల్పడ్డారన్నారు. తమ్మిడి చెరువు నుంచి వచ్చే నాలా ఈదులకుంటలోకి వస్తుందని, దానిని రానివ్వకుండా కొందరు కబ్జాదారులు అక్రమంగా మళ్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వర్షాలతో ఈ చెరువు నీటితో నిండిందని, అసలు ఇక్కడ చెరువు లేదని కబ్జాకు యత్నిస్తున్న వారు పక్కదారి పట్టిస్తున్నారని, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. హైటెక్ సిటీ మాదాపూర్ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపునకు దోహదపడే ఈదులకుంట చెరువును కబ్జా నుంచి కాపాడాలని పార్టీ ప్రతినిధులు కమిషనర్‌ను కోరారు.

అంబేద్కర్ ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లడం గర్వంగా ఉంది

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కలలుగన్న ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం గర్వంగా ఉందని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ముని మనుమడు భీమ్‌రావు యశ్వంత్‌రావు తెలిపారు. కీసర మండల కేంద్రం ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి యశ్వంత్‌రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల అంబేద్కర్ సంఘం నేతలు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి అంబేద్కర్ చిత్రపటాన్ని అందించారు. ప్రతి వారం అంబేద్కర్‌కు జ్ఞానమాల వేస్తున్నామని సంఘం నేతలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం నేతలు పాల్గొన్నారు.
- కీసర, ఆగస్టు 12

ఎన్‌ఐఆర్‌ఎఫ్‌లో సత్తాచాటిన విజ్ఞాన్ వర్సిటీ

సిటీబ్యూరో, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ): కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సోమవారం విడుదల చేసిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌ఐఆర్‌ఎఫ్)లో విజ్ఞాన్ యూనివర్సిటీ సత్తా చాటింది. జాతీయ స్థాయిలో 72వ ర్యాంకును సొంతం చేసుకుందని వీసీ ప్రొ. పి.నాగభూషణ్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో విజ్ఞాన్ వర్సిటీ నిలిచిందని, వర్సిటీ 72వ ర్యాంకులో నిలిస్తే, ఇంజినీరింగ్ విభాగంలో 91వ ర్యాంకు వరించినట్లుగా వివరించారు. టీచింగ్ లెర్నింగ్ రిసోర్సెస్, రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్రాడ్యుయేషన్ ఔట్‌కమ్, ఔట్‌రీచ్ అండ్ ఇంక్లూజివిటీ, పీఆర్ పర్సెప్షన్ కేటగిరీల్లో విజ్ఞాన్ వర్సిటీ పనితీరును గుర్తించి ర్యాంకులను కేటాయించిందన్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీకి ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకు లభించడంతో కేంద్ర, రాష్ట్ర, ప్రైవేటు ఏజెన్సీల నుంచి గ్రాంట్లు వస్తాయన్నారు. విజ్ఞాన్‌కు ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకు లభించడం వలన ప్రముఖ బహుళ జాతి కంపెనీల్లో విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. అదేవిధంగా అంతర్జాతీయ స్కాలర్‌షిప్‌లను కూడా సొంతం చేసుకునే వీలు ఉంటుందని ఆయన తెలిపారు. కాగా, వర్సిటీకి జాతీయస్థాయిలో మంచి ర్యాంకు రావడానికి కృషి చేసిన ఐక్యూఏసీ బృందాన్ని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ ప్రొ. పి.నాగభూషన్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ ప్రత్యేకంగా అభినందించారు.

రేడియాలజీలో ఏఐ పరిజ్ఞానం

అభివృద్ధి చేసిన ట్రిపుల్ ఐటీ పరిశోధక బృందం

సిటీబ్యూరో, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): వైద్య రంగంలో కృత్రిమ మేధస్సు పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించేందుకు పరిశోధనలు జరుగుతున్నాయి. రోగ నిర్ధారణ, చికిత్స అందించడంలో కీలకమైన రేడియాలజీ విభాగంలో కృత్రిమ మేధస్సు పరిజ్ఞానం(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)ని వినియోగించి మెరుగైన వైద్య సేవలందించే పరిశోధనను గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ పరిశోధక బృందం అభివృద్ధి చేసింది. ప్రొఫెసర్ జయంతి శివస్వామి నేతృత్వంలో మెడికల్ ఇమేజింగ్‌లో 'ఏఐ' అనే అంశంపై పరిశోధనలు చేశారు. ఇప్పటి వరకు రేడియాలజీలో ఎక్స్‌రేలు, స్కానింగ్‌ల ద్వారా రోగ నిర్ధారణ పరీక్షలు చేపడుతుండగా, అందులో ఏఐ సహాయక రేడియాలజీ ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉందని ఈ పరిశోధనలో గుర్తించారు. చాలా కాలంగా ఆరోగ్య సంరక్షణలో, రోగ నిర్ధారణలో చిత్రాలు(ఇమేజింగ్) చాలా కీలకంగా ఉంటున్నాయి. ఛాతి వ్యాధులు, రొమ్ము క్యాన్సర్ వంటి వాటిని పరీక్షించేందుకు ఎక్స్‌రే, అల్ట్రాసోనోగ్రఫీ, ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వంటివి చేసి వ్యాధుల తీవ్రతను ఆయా చిత్రాల ద్వారా గుర్తిస్తున్నారు. కొత్తగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ ఇమేజింగ్ సౌలభ్యంతో ఏఐ ద్వారా చాలా సులభంగా కంప్యూటర్‌లో ప్రాసెసింగ్ చేసి నిర్ధారణ చేసే అవకాశం ఉందని ప్రొఫెసర్ జయంతి శివస్వామి పరిశోధక బృందం గుర్తించింది.

కూకట్‌పల్లి డిపోకు రెండు మెట్రో డీలక్స్

బాలానగర్, ఆగస్టు 12: కూకట్‌పల్లి డిపోకు నూతనంగా వచ్చిన రెండు మెట్రో డీలక్స్ బస్సులను జగద్గిరిగుట్ట-సికింద్రాబాద్, సికింద్రాబాద్-జగద్గిరిగుట్ట ప్రాంతానికి నడుపుతామని ఆర్టీసీ డిపో మేనేజర్ హరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ బస్సు ప్రతిరోజు ఉదయం 7 గంటలకు జగద్గిరిగుట్ట నుంచి బయలుదేరుతుందని తెలిపారు.

అథ్లెటిక్స్ జట్టు మేనేజర్‌గా బికాష్

హైదరాబాద్, ఆట ప్రతినిధి ఆగస్టు 12: ప్రపంచ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత అథ్లెటిక్స్ జట్టు మేనేజర్‌గా హైదరాబాద్ జిల్లాకు చెందిన బికాష్ కరార్ ఎంపికయ్యారు. అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారుడిగా ఫ్రాన్స్, సింగపూర్, మలేషియా, థాయిలాండ్ యూఎస్ఏలో జరిగిన ప్రపంచ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారు. ప్రస్తుతం బికాష్ కరార్ తెలంగాణ మాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

హెచ్‌జీఏ ప్రెసిడెంట్స్ కప్ విజేత విశేష్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్(హెచ్‌జీఏ) ఆధ్వర్యంలో జరిగిన 11వ ప్రెసిడెంట్స్ కప్ టోర్నీలో విశేష్‌శర్మ విజేతగా నిలిచాడు. 400 మంది గోల్ఫర్లు పోటీపడ్డ ఈ టోర్నీలో విశేష్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ అతను టైటిల్ సొంతం చేసుకోగా, వేదాంశ్‌రావు రన్నరప్‌గా నిలిచాడు. మిగతా విభాగాల్లో పద్మశ్రీరెడ్డి, ఎమ్ఎస్ ధిల్లాన్, ఏవీఎన్ రెడ్డి, మణికంఠ్‌రెడ్డి, రిషబ్‌సింగ్ టైటిళ్లు సొంతం చేసుకున్నారు. ముగింపు కార్యక్రమంలో హెచ్‌జీఏ అధ్యక్షుడు జయంత్ ఠాగూర్, కార్యదర్శి వందిత్‌రెడ్డి, కోశాధికారి ఉత్తమ్‌సింగాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెషనల్ అభివృద్ధికి సాఫ్ట్ స్కిల్స్

వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వెంకటేశం

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 12: ప్రొఫెషనల్ అభివృద్ధిలో సాఫ్ట్ స్కిల్స్ పాత్ర కీలకమని వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ బుర్రా వెంకటేశం అన్నారు. సోమవారం జేఎన్‌టీయూహెచ్ యూజీసీ- మాలవిమా మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్‌లో సాఫ్ట్ స్కిల్స్ ప్రొఫెషనల్ ఎక్సలెన్స్ అనే అంశంపై ఒక వారం ఆన్‌లైన్ ఎస్టీపీ, డ్రగ్స్ డిస్కవరీ డెవలప్‌మెంట్‌లో కృత్రిమ మేధస్సు ఆధారిత ఆవిష్కరణలపై రిఫ్రెషర్ కోర్సులను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ప్రొఫెషనల్‌గా అభివృద్ధి సాధించాలంటే నైపుణ్యాలను పెంచుకోవాలని, యూజీసీలో సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కొత్త డ్రగ్స్ ఆవిష్కరణలో ఏఐ పరిజ్ఞానంలో ఇటీవల వచ్చిన కొత్త ట్రెండ్స్, తక్కువ ఖర్చుతో వినియోగదారులకు అనుకూలంగా ఉండేలా రూపొందించినట్లు తెలిపారు. యూజీసీ-ఎంఎంటీటీసీ డైరెక్టర్ జీ.ఎన్.శ్రీనివాస్, కోర్సు కోఆర్డినేటర్ పార్వతి, ఫార్మసీ విభాగాధిపతి ఎస్.శోభ పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో 150 మంది పాల్గొన్నారు.

స్టేషన్‌లోనూ ఓయూ విద్యార్థుల దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: ఉస్మానియా యూనివర్సిటీలో మరోసారి ఉద్రిక్తత తలెత్తింది. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించాలని, సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరాహార దీక్ష చేపట్టారు. అయితే పోలీసులు అడ్డుకుని దీక్ష చేస్తున్న విద్యార్థులను అదుపులోకి తీసుకుని అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో విద్యార్థి నాయకులు స్టేషన్‌లోనే తమ దీక్షను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీల పదవీకాలం ముగిసి దాదాపు మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు వీసీలను నియమించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇన్‌చార్జి వీసీలతో కాలయాపన చేస్తూ వర్సిటీల మనుగడకే ముప్పు తీసుకువస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమ ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్రంలోని వర్సిటీలకు మహర్దశ తీసుకువస్తామని అన్నారని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం ఏర్పడి నెలలు గడిచినా ఇప్పటి వరకు వర్సిటీల సంక్షేమం గురించి మాట్లాడిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలలో ఖాళీగా ఉన్న 82శాతం టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, వర్సిటీ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి మెరుగైన హాస్టల్ వసతి కల్పించాలన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయాలన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో దీక్ష కొనసాగిస్తున్న ఏబీవీపీ నాయకులు

భారతీయ సంస్కృతిని పరిరక్షించాలి

ప్రముఖ సంగీత విద్వాంసుడు వి.ఆనందమోహన్‌ను సన్మానిస్తున్న సదస్సు నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: భారతీయ సంస్కృతిని పరిరక్షించి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రముఖ సంగీత విద్వాంసుడు వి.ఆనందమోహన్ అన్నారు. నవ్యనాటక సమితి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'గాంధర్వం-2' జాతీయస్థాయి సదస్సు సోమవారం వైభవంగా ముగిసింది. ఓయూ క్యాంపస్‌లోని ఏఎంఎస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ సదస్సు ముగింపు సభకు ముఖ్యఅతిథిగా వి.ఆనందమోహన్ హాజరై మాట్లాడారు. ఇలాంటి సదస్సులతో భావితరాలకు ఎంతో మేలు జరుగుతుందని, సదస్సు నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం సదస్సు నిర్వాహకులు ఆనందమోహన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర, తెలుగు యూనివర్సిటీ సంగీత విభాగం హెడ్ డాక్టర్ రాధా సారంగపాణి, శ్రీవెంకటేశ్వర వేదాంత వర్ధిని కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నండూరి విద్యారణ్యస్వామి, నవ్యనాటక సమితి అధ్యక్షుడు విజయకుమార్, డాక్టర్ పి.ఇందిరాహేమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పట్టుదల, క్రమశిక్షణ ముఖ్యం



మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు ఉపాధ్యాయుల నియామకానికి రూ.8లక్షల విలువజేసే చెక్కును అందజేస్తున్న ఆర్క్ సెర్వ్ సంస్థ ప్రతినిధులు

ఆర్క్‌సెర్వ్ సంస్థ సీఈవో క్రిస్ బాబెల్

మణికొండ, ఆగస్టు 12: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పట్టుదల, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని ఆర్క్ సెర్వ్ సంస్థ సీఈవో క్రిస్ బాబెల్ అన్నారు. ఆర్క్ సెర్వ్ సంస్థ తన 10వ వార్షికోత్సవాన్ని మణికొండలోని జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి జరుపుకున్నారు. సంస్థ తన సీఎస్ఆర్ కార్యక్రమాలతో 1473 మంది విద్యార్థులపై సానుకూల ప్రభావం చూపిస్తుందన్నారు. అగ్రశ్రేణి ఫలితాలు సాధించిన విద్యార్థులు డి.కుష్వంత్ రణచంద్రవర్మ(10/10), ఎస్.భార్గవి (9.8/10), బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన ఎం.మిర్యామిలను సత్కరించి వారికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన రెండేళ్లలో ఈ పాఠశాల విద్య, మౌలిక వసతుల పరంగా ఎంతో పురోగతి సాధించిదన్నారు. ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్ సంస్థకు రూ.8లక్షల విరాళం అందిస్తున్నామన్నారు. దీంతో సంస్థ ఉన్నత తరగతులకు అదనపు ఉపాధ్యాయులను నియమిస్తుందన్నారు. విద్యార్థులకు క్రీడా పరికరాలు, ఇతర పరికరాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ ఈవీపీ మైఖేల్ లిన్, వైస్ ప్రెసిడెంట్, జీఎం అంబరీశ్‌కుమార్, హెచ్‌ఆర్ డైరెక్టర్ కరుణ గడ్డెం, ఫెసిలిటీస్, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్, సీఎస్‌ఆర్ లీడ్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.